ప్రజాశక్తి
శుక్రవారం 30 జూన్ 2023

సిపిఎం నుంచి తవిటినాయుడు బహిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్

మక్కువ మండలానికి చెందిన సిపిఎం కార్యకర్త చింతల తవిటినాయుడును పార్టీ నుంచి బహిష్కంచినట్లు ఆ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు జిల్లా కార్యదర్శివర్గం, జిల్లా కమిటీ సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తవిటినాయుడు గత కొంత కాలంగా పార్టీ నిబంధనలు, నిర్మాణ పద్ధతులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పార్టీ అంతర్గత విషయాలను పలుచోట్ల బహిర్గతం చేయడం, పత్రికలకు విడుదల చేయడం వంటి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం వల్ల పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తవిటినాయుడును తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

గిరిజనులకు దక్కని భరోసా

- ప్రస్తావనకు రాని ఏనుగుల తరలింపు
- పూర్ణపాడు -లాబేసు వంతెన ఊసేలేదు
- పట్టని జంఝావతి సాగునీటి ప్రాజెక్టు
- కొరియా సరిహద్దు వివాదం పట్టని వైనం
- నిరాశపర్చిన సిఎం పర్యటన
- మన్యంలో పెల్లుబుకుతున్న అసంతృప్తి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 28న మన్యం జిల్లా కురుపాం మండల కేంద్రంలో సిఎం బహిరంగ సభ జరిగిన విషయం విధితమే. సభలో గిరిజన సమస్యలపై గాని, ఈ ప్రాంత అభివృద్ధి గురించి గాని నామమాత్రంగానైనా సిఎం ప్రస్తావించలేదు. సభకు ఉమ్మడి జిల్లాలోని నాలుగు డిపోలతోపాటు విశాఖపట్నం నుంచి కూడా ఆర్టీసి బస్సులను మళ్లించి జనాలను తరలించారు. గిరిశిఖర గ్రామాల్లోవున్నవారిని కూడా ప్రైవేటు వాహనాల్లో కొండలు, గుట్టలు దాటించుకుంటూ బుధవారం ఉదయానికే తీసుకొచ్చారు. వీరంతా గిరిజను ఉత్పత్తులకు గిట్టుబాటు ధరపై భరోసా దొరకుతుందని, ముఖ్యంగా ఏనుగుల నుంచి ప్రాణహాని తప్పే భరోసా దొరుకుతుందని, రహదారులు, వంతెనల సమస్యలు పరిష్కారమౌతాయని, ఐటిడిఎ పథకాలు దరిచేర్చేందుకు అభయమిస్తారని ఇలా ఎన్నో ఆశలు పెట్టుకుంటూ వచ్చారు. కానీ, ఆచరణలో ఇవేవీ సిఎం నోట వినిపించలేదు. స్థానిక ఎమ్మెల్యే ఒకటీ అర కొత్త పథకాలను అడిగినప్పటికీ జిల్లాను ప్రభావితం చేసే సమస్యలను ప్రస్తావన చేయలేదు. ముఖ్యంగా ఒడిశా ప్రాంతం లకేరి అడవులు నుంచి వచ్చిన అడవి ఏనుగుల గుంపు 16 ఏళ్లుగా మన్యం వాసుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే ఏనుగుల దాడిలో 17 మంది మృతిచెందారు. వేలాది ఎకరాల్లో పంటలను నాశనం చేశాయి. ఈ నేపథ్యంలో ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని జిల్లా వాసులు గగ్గోలు పెడుతున్నా అతీగతీ లేకుండా పోయింది. చాలా గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తించక పోవడంతో అక్కడి గిరిజనులు ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందలేక పోతున్నారు. గిరిజన చట్టాలు సరిగా అమలు కావడం లేదనే ఆందోళనలో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తునే ఉన్నారు. జంఝావతి సాగునీటి ప్రాజెక్టు పూర్తికి ఒడిశా రాష్ట్రంతో నెలకున్న చిన్నపాటి వివాదం దశాబ్దాలు తరబడి కొనసాగుతోంది. దీన్ని పరిష్కరించే పేరుతో శ్రీకాకుళంలోని ఓ పార్టీ నేత పెళ్లికి వెళ్లిన సిఎం జగన్ పనిలోపనిగా భువనేశ్వర్ వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇతర అధికారులతో చర్చించారు. ఇది జరిగి సుమారు రెండేళ్లు గడిచినా తరువాత పట్టించుకోలేదు. ఏజెన్సీలోని జీవగెడ్డలపై మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యామ్‌లు నిర్మించడం ద్వారా సాగునీటి వనరులను పెంచాలని స్థానికులు దశాబ్దాలు తరబడి కోరుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. వీటిపై కనీసం సిఎం ప్రస్తావించలేదు. జిల్లాలోని వేలాది మంది జీడి రైతులు మద్ధతు ధర కోసం ఇటీవల ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా వైద్యం అందించే ఎఎన్ఎంలు లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తుంది. డోలీ మోత తప్పడం లేదు. సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 176 సవర భాష పాఠశాలలు ఉన్నాయి. వారి సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణమైన భాష ద్వారానే విద్యాబోధన చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోలేదు. గుమ్మ లక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటుకు ఐటిడిఎ అధికారులు చర్యలు చేపట్టినా పనులు మాత్రం ప్రారంభించలేదు. కొమరాడ మండలం పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో, సుమారు 20 గ్రామాల ప్రజానీకం మండల కేంద్రానికి రావాలంటే సుమారు 30నుంచి 40కిలోమీటర్ల దూరం మేర ప్రయాణం చేయాల్సిన దుస్థితి కొనసాగుతోంది. టిడిపి ప్రభుత్వం హయాంలో ఈ వంతెను ఎప్పటికి పూర్తిచేస్తారంటూ జిల్లా పరిషత్ సమావేశాల్లో వీరంగం సృష్టించి, సభను స్తంభింపజేసిన స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కనీసం పట్టించుకోవడం లేదని కొమరాడ మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటిపైనా ముఖ్యమంత్రి కనీస ప్రస్తావన కూడా చేయకపోవడంతో గిరిజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలు సమస్యలపై ప్రజాసంఘాల నాయకులు ముఖ్యమంత్రికి వినతులిచ్చినా వాటి గురించి కూడా ప్రస్తావన లేదు. పైగా సిఎం రాక నేపథ్యంలో ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఆయన అభద్రతా భావానికి నిదర్శనమని విమర్శలు వినిపిస్తున్నాయి

తాను అనుకున్నది చేయడం వేరు... ప్రజలకు అవసరమైనది చేయడం వేరు... మొదటి కోవలో కొట్టుకుపోయారు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి. మన్యం జిల్లా వచ్చినట్టే వచ్చి తాను చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లిపోయారు తప్ప, వాస్తవ పరిస్థితులను ఏమాత్రం ఆకలింపజేసు కోలేకపోయారు. బహుశా ముందుస్తుగా తెలుకోవాలని అనిపించలేదో... ఆ పార్టీ నాయకులు చెప్పేందుకు సాహించలేకపోయారు. కారణం ఏదైనా... కారకులు ఎవరైనా సిఎం మన్యం జిల్లా పర్యటన నేల విడిచి సాము చేసినట్టయ్యింది. వచ్చింది అమ్మఒడి ప్రారంభోత్సవం కోసమైనా సభ జరిగిందీ, ప్రసంగం చేసిందీ ఓ మారుమూల వెనుకబడిన గిరిజన ప్రాంతంలోనే. ఈనేపథ్యంలో గిరిజనుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సిఎం మాట్లాడలేదు. దీంతో, గంపెడంత ఆశలతో వచ్చిన గిరిజనులు, పుట్టెడు నిరాశ, నిస్పృహలతో వెనుదిరిగారు.

విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమం

ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ వెంకటేశ్వరరావు

అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమం చేపట్టాలని ఫ్యాప్టోరాష్ట్ర చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రజలను, ప్రజాసంఘాలను కలుపుకొని వెళ్లాలని సూచించారు. గురువారం జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ ఉమహేశ్వరరావు అధ్యక్షతన స్థానిక ఎన్‌జిఒ హోంలో ఉమ్మడి జిల్లా విద్యా సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు ప్రసంగించారు. జీవో నెంబర్ 117 వల్ల రాష్ట్రంలో వేల సంఖ్యలో పాఠశాలలు మూసివేసే పరిస్థితి నెలకొందన్నారు. దీనివల్ల ఎస్‌జిటి పోస్టులు రద్దయ్యే అవకాశాలు ఉన్నాయని, కావున ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి పాఠశాలల పర్యటనకు వెళ్తూ ఏ చిన్న తప్పు కనిపించినా ఉపాధ్యాయులను, విద్యాశాఖ అధికారులను శిక్షించడమే పనిగా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. . ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు ఇచే పెన్షన్ విషయంలో జిపిఎస్ పేరుతో మళ్లీ మోసం చేయాలని చూస్తుందని అన్నారు. వెంటనే సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను యథాతథంగా అమలు చేయాలని అన్నారు. సదస్సులో అనంతరం భాగస్వామ్య సంఘాల రాష్ట్ర నాయకులు భానుమూర్తి (ఎపిటిఎఫ్ 257), గణపతి (ఆప్టా), సదాశివరావు (ఎపిటిఎఫ్ 1938), జోగారావు (ఎస్‌టియు), డి.రాము (యుటిఎఫ్), ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ వెంకట రమణ, డిప్యూటీ సెక్రటరీలు రమేష్ చంద్ర పట్నాయక్, డి.శ్యామ్, కార్యవర్గ సభ్యులు డి.ఈశ్వరరావు, కె.సన్యాసినాయుడు, వై.అప్పారావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4న పార్వతీపురంలో మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో జులై 4న స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మినీ జాబ్‌మేళా జరుగుతుందని జిలఆల నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధికల్పనలో భాగంగా ఎంటెక్, బిటెక్, బిఇ, బిఎస్‌సి, ఎంఎస్‌సి కామర్స్, ఎంసిఎ, బిసిఎస్, ఎంసిఎస్, ఎంసిఎ 2022-23 సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించి వారు, చివరి సంవత్సరం చదువుతున్న వారు సైట్ స్పెక్టర్ టెక్నాలజీస్ కంపెనీలో సాఫ్ట్వేర్ ట్రైనీగా జీతం సంవత్సరానికి రూ.2.4 నుంచి రూ.6.0 లక్షలు ఉంటుందని, డిగ్రీ పూర్తి చేసుకున్న వారికి ఎంఎస్ఎన్ లేబొరేటరీస్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్, ట్రైనీ ఆఫీసర్, ముథూట్ ఫైనాన్స్‌లో ఇంటెర్న్ పిఒగా ఉద్యోగాలు కల్పించబడునని తెలిపారు. 18 నిండి 27 ఏళ్ల మధ్య గల నిరుద్యోగ యువత ఈ మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందనీ, ఈ మినీ జాబ్ మేళాకు పై కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకుంటారని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ వివరాలను www.apssdc.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమే, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు జెరాక్స్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరుగు ప్రదేశంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9182398325, 7997299739 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఆందోళన చేస్తున్న జెకెపాడు గిరిజనులు, గిరిజన సంఘం నాయకులు

విఎస్ఎస్ భూముల జోలికొస్తే సహించేది లేదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత కొన్నేళ్ల నుంచి కాపాడుకొని వస్తున్న వన సంరక్షణ సమితి భూమిని బయట ప్రాంతం గ్రామస్తులు ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని, తమ భూమి జోలికొస్తే సహించేదే లేదని ఎల్విన్‌పేట పంచాయతీ జెకెపాడు గ్రామస్తులు హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా ఒకచోటకు చేరి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నలుగురు గిరిజనేతరులు గిరిజనుల మధ్య చిచ్చుపెట్టేందుకు తోలుఖర్జ గ్రామస్తులను రెచ్చగొట్టి తమ స్వాధీనంలో ఉన్న విఎస్ఎస్ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇదే విషయమై ఎల్విన్‌పేట పోలీసులకు, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం జెకెపాడుకు అటవీ శాఖ కురుపాం రేంజర్ ఏడుకొండలు వచ్చి గ్రామస్తులతో సమావేశమయ్యారు. విఎస్-ఎస్ భూమిని గ్రామస్తులు, అటవీశాఖ అధికారులు కాపాడుకోవాలని కోరారు. విఎస్ఎస్ భూములను ఎవరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే వారిపై కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి గంగునాయుడు, ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, జిల్లా కమిటీ సభ్యులు కోలక అవినాష్, వార్డు సభ్యులు నాగేశ్వరరావు ఉన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 30న (శుక్రవారం) మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో జరుగుతుందని ఎంపిడిఒ కె.సత్యం తెలిపారు. స్థానిక వైటిసి కార్యాలయంలో జరగనున్న ఈ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంతారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్రంలో గల 2.95 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కాంతారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా కమిటీ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులను మాత్రమే రెగ్యులరైజ్ చేస్తూ నిర్ణయించడం వల్ల అతి కొద్దిమంది మాత్రమే రెగ్యులరైజ్ అవుతారని, కావున 2022 డిసెంబర్ 31 నాటికి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యుత్, ఆర్‌టిసి, టూరిజం, హౌసింగ్ వంటి 26 ప్రభుత్వరంగ సంస్థలు, మున్సిపల్, పంచాయతీ వంటి స్థానిక సంస్థలు, ప్రభుత్వ సొసైటీలు, సమగ్రశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధిహామీ, వెలుగు తదితర ప్రభుత్వ పథకాలు, యూనివర్సిటీలు, టిటిడి వంటి ధార్మిక సంస్థల్లో మూడు లక్షలకు పైగా ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన అనేక ఏళ్లు పని చేస్తున్నారన్నారు. వీరే కాక పైశాఖలు, సంస్థల్లో మూడు దశాబ్ధాల నుంచి ఎన్ఎంఆర్, డైలీవేస్, కంటింజెంట్, టైంస్కేల్ ఉద్యోగులు పని చేస్తున్నారని, వీరంతా ఏ నాటికైనా తాము రెగ్యులర్ అవుతామన్న ఆశతో అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారనని అన్నారు. కావున గత ఎన్నికల సందర్భంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని, లేనిచో ఉద్యోగులను ఐక్యం చేసి రాష్ట్ర జెఎసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆందోళనలకు సన్నద్ధం కావాలని రాష్ట్ర జెఎసి పిలుపునిస్తుందని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కొత్తగా వచ్చారని, ఏడాదే అయ్యిందంటూ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు సరైనవి కాదని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉమ్మడి రాష్ట్రం కాలం నుండి విధులు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే తెలంగాణలోఎవరూ రెగ్యులర్ కాలేదంటున్న మంత్రి వ్యాఖ్యలు వాస్తవం కాదని, తెలంగాణాలో 2014 జూన్ 2 నాటికి పనిచేస్తున్న వారిని (5544 మందిని) రెగ్యులర్ చేశారని, వీరితో పాటు విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందర్నీ రెగ్యులర్ చేశారని అన్నారు. ఇదే విధంగా మన రాష్ట్రంలోనూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే డిశంబర్ 31, 2022 నాటికి పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగికి 3 లేదా 5 ఏళ్ల సర్వీస్ పూర్తి అయిన వెంటనే రెగ్యులర్ చేసేలా నిర్ధిష్ట ఉత్తర్వులు ఇవ్వాలని, 1993కు ముందు నుంచి పని చేస్తున్న డైలీవేజ్, టైంస్కేల్, కంటింజెంట్ తదితర కేడర్ల ఉద్యోగులను రెగ్యులర్‌చేయాలని, పార్ట్‌టైం, గెస్ట్ వ్యవస్థను ఫుల్‌టైంగా మార్చాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, పెన్షన్,రిట్మెర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జెఎసి నాయకులు శైలజ, ఈశ్వరరావు, విజయలక్ష్మి, ఆనందరావు వివిధ రంగాల కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంతారావు

సమస్యలను తీర్చలేని సిఎం

మాజీమంత్రి శత్రుచర్ల

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

నియోజకవర్గంలో ఏనుగుల సమస్య తీవ్రంగా ఉందని, రైతాంగం ఏనుగుల గుంపు సంచారంతో అవస్థలు పడుతున్నారని, అలాగే పూర్ణపాడు లాబేసు వంతెన పూర్తి చేయలేని ప్రభుత్వం కళ్లుండీ చూడలేని ప్రభుత్వంగా మారిందని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు విమర్శించారు. గురువారం చినమేరంగిలో తన నివాసంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలను తీర్చలేని, గిరిజన ప్రాంత అభివృద్ధిని ఆకాంక్షించని ప్రభుత్వం వట్టి మాటలు చెబుతుందని విమర్శించారు. తాను గతంలో తెచ్చిన జీవో నెంబర్ 164ను తుంగలో తొక్కి ఇప్పుడు తోటపల్లి కాలువ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలనడం రైతాంగాన్ని మోసగించడమేనన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు కూడా నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి ముందు పెట్టలేదని ఎద్దేవా చేశారు. కనీసం రాష్ట్ర గిరిజనశాఖా మంత్రిని సమావేశంలో మాట్లాడనివ్వకపోవడం శోచనీయమన్నారు రానున్న ఎన్నికల్లో ప్రభుత్వం మారడం తథ్యమని చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వంతో మూడు నెలల్లో నియోజకవర్గ సమస్యలను పరిష్కరిస్తామని, లేకుంటే తాను రాజకీయ సన్యాసం పుచ్చుకుంటానని శత్రుచర్ల విలేకరులతో అన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే స్థానిక సమస్యలపై ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావించలేదన్నారు. జీవో 3ను రద్దుచేసి బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ మరోవైపు గిరిజనులను అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పడం మోసపూరితమైనవని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన లేదని రాక్షస పాలన కొనసాగుతుందని అన్నారు. గిరిజన ప్రాంతంలో వేలాదిమంది విద్యార్థులు చదువుకుని ఉన్నారని జాబ్ కేలండర్ ప్రకటిస్తామని చెప్పి నేటికీ ప్రకటించని ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి కృషి చేస్తామని అనడం హాస్యాస్పదమని జగదీశ్వరి అన్నారు. సమావేశంలో అరకు పార్లమెంట్ అధికారి ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, నాయకులు గులిపల్లి సుదర్శన రావు, నంగి రెడ్డి మధుసూదనరావు, కష్ణారావు, గంట వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పవన్ రాజకీయ అజ్ఞాని

జగనన్న సురక్ష సమావేశంలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయ అజ్ఞాని అని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పట్టణంలోని శ్రీ సీతారామ కల్యాణ మండపంలో వాలంటీర్లకు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లకు జగనన్న సురక్షపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కి రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరిగిందో తెలుసుకోకుండా ప్రభుత్వంపై బురద జల్లడమే ధ్యేయంగా పని చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం ఎమ్మెల్యేలను పేదలు ఎక్కడ కలుస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఎలాంటి సిఫార్సు లేకుండా పేదరికమే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదేనని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో టిడిపి నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాల మంజూరుకు దోపిడీ చేశారని ఆరోపించారు. అప్పుడు ఈ జనసేన అధినేత ఏమయ్యారని ప్రశ్నించారు. రూపాయి లంచం తీసుకోకుండా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం వివిధ గ్రాంట్లకు సంబంధించి నిధులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కాంట్రాక్టర్లకు బిల్లు మంజూరులో జాప్యం లేదన్నారు. మరి అలాంటి పరిస్థితుల్లో పనులు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్‌చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కమిషనర్ శంకరరావు, కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు జరిగేలా చూడాలని కోరారు. వీరికి తెలిసిన కాంట్రాక్టర్లతో చేయించాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్‌రావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, బి.శ్రీనివాసరావు, జి.వరప్రసాద్, సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పార్వతిపురం టౌన్ : ప్రతి ఇంటి సభ్యునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనేదే జగనన్న సురక్ష లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక ఏడో వార్డు సచివాలయంలో 13,14 వార్డుల వాలంటీర్లు, గృహ సారథులు, ఉద్యోగులతో కలిసి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హత గల ఏ ఒక్క లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందకుండా ఉండకూడదన్నారు. ఇంకా ఎక్కడైనా అర్హులు ఉండీ సంక్షేమ పథకాలు పొందలేకున్న వారిని గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందజేయాలన్నారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జెసిఎస్ కన్వీనర్ జీ మాధవరావు, కన్వీనర్లు ఎస్ శ్రీనివాసరావు, శేషు, వి గురురాజు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు సచివాలయం ఉద్యోగులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

ప్రకృతిని పరిరక్షించుకోవాలి

జిల్లా మేనేజర్ షణ్ముఖరాజు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ,అందులో ప్రకతి వ్యవసాయ కార్యకర్తలు ప్రథమ స్థానంలో నిలవాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో మండలానికి చెందిన ఎపిసిఎన్ఎఫ్ ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు 55మందికి గురువారం శిక్షణా కార్యక్రమం జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు వారి సొంత క్షేత్రంలో పంటలు నమూనాలు వేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ ఆ గ్రామంలోని రైతులకు ఆదర్శవంతంగా నిలవాలన్నారు. శ్రీవరి, చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని, వాణిజ్య పంటలైన పెసలు, మినుములు, ఉలవలు, మొదలగు పంటలు వేసుకోవడం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు. పండ్ల తోటల్లో అంతర్ పంటలు, పలు పంటలు వేసుకోవడం వల్ల జీవవైవిద్యం సాధించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. పల్లపు భూముల్లో తప్పనిసరిగా అందరూ రైతులచే నవధాన్యాలు వేసుకునేలా చూడాలని, మెట్టు భూముల్లో ఎదజల్లడం, కనీసం ఒక ఐదు సెంట్లు విస్తీర్ణంలో విత్తనబంతులు తయారుచేసి వేయాలని, ఎద జల్లడంలోని దిగుబడి, విత్తనబంతులు వేసిన క్షేత్రంలో దిగుబడి, ప్రయోగం చేయాలని అన్నారు. వరి గట్టులపై చిక్కుడు, బెండ, బీర, ఆనప, బంతి మొదలగు పంటలు వేసుకోవడం వల్ల అదనపు ఆదాయంతో పాటు తెగుళ్లను నివారించవచ్చు అన్నారు. కార్యక్రమంలో జట్టు కో డైరెక్టర్ ఎం.నూకంనాయుడు, ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, మండల ఇన్చార్జి వి.పోలినాయుడు, ధనుంజయరావు, ప్రసాదు కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ జిల్లా కోఆర్డినేటర్ వి.గౌరీశంకర్ రావు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ షణ్ముఖరాజు

ప్రజాశక్తి
www.prajasakti.com

మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా బక్రీద్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో బక్రీద్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని పాలకొండరోడ్‌లో గల జామా మసీద్‌లో నమాజ్ చేసి బక్రీద్ నిర్వహించారు. బక్రీద్ ప్రాముఖ్యతను ముస్లిం పెద్దలు వివరించారు. త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని తెలిపారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మన్యం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏదీ?

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన జిల్లాలో కాకుండా విజయనగరం జిల్లాలో గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేయడం ద్వారా గిరిజనుల పట్ల ఈ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి వుందో తెలుస్తోందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి అన్నారు. గురువారం ఆమె నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ అమ్మ ఒడి ప్రారంభోత్సవానికి మన్యం జిల్లా పర్యటనకు వచ్చిన సిఎం జగన్ మోహన్ రెడ్డి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై అబద్ధాలు మాట్లాడారని చెప్పారు. గిరిజన ఉపముఖ్యమంత్రి రాజన్నదొరకు తన పక్కన కూర్చోడానికి స్థానం ఇవ్వకపోవడంలోనే జగన్‌రెడ్డికి గిరిజనులపై ప్రేమను చూపిస్తోందన్నారు. గిరిజన విద్య, వైద్యం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఇటీవల మినీమహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోని చూసి సిఎం జగన్‌కు మతిభ్రమించి ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని సంధ్యారాణి ఆరోపించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఇఇ గోపాలకృష్ణమూర్తి

పెద్దవలసలో జింక మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం

కొమరాడ మండలంలో పెద్దవలస బీట్ సమీపంలో గల ప్రాంతంలో మచ్చల జింక మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం వచ్చింది. ప్రమాదవశాత్తు మరణించిన ఈ జింకకు అటవీశాఖ అధికారులు దగ్గరుండి పోస్టుమార్టం నిర్వహించారు. అయితే చనిపోయిన జింకను పోస్టుమార్టం చేయగా గర్భంలో పిల్ల ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు పార్వతీపురం రేంజర్ పి.త్రినాధరావు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం జింక ఏ కారణంతో మృతి చెందింది అనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. దీంతో పాటు అటవీశాఖ ఫారెస్టర్ గౌరీశంకర్ డాక్టర్ చక్రధర్ తదితరులున్నారు.

3న గురుపౌర్ణమి ఉత్సవాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జూలై 3న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు పట్టణంలోని వైకెఎం నగర్ షిరిడి సాయి మందిరం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శయనైక ఏకాదశి సందర్భంగా గురువారం మందిరంలో ప్రత్యేకమైన క్షీరాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాడ శుద్ధ పూర్ణిమ, వ్యాస పూర్ణిమ సందర్భంగా మందిరంలో సోమవారం గురుపౌర్ణిమ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలియచేశారు.

బాధిత కుటుంబానికి వితరణ అందుజేస్తున్న జిసిడిఒ, తోటి ఉపాధ్యాయులు

ఆదుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

1998లో డిఎస్‌సిలో అర్హత సాధించి, ఉపాధ్యాయ వృత్తిని చేపట్టకముందే మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబాన్ని 1995-96లో భీమిలిలోని డైట్ చదివిన తోటి మిత్రులు ఆదుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం బల్లకృష్ణాపురానికి చెందిన తాలబత్తుల శ్రీనివాసరావు 1998 డిఎస్‌సిలో అర్హత సాధించాడు. ఈ మేరకు ఆయనకు మక్కువ మండలం గోపాలపురం పోస్టింగ్ వచ్చింది. అయితే ఆయన విధుల్లో చేరకముందే గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి భరోసాగా తనతో పాటు డైట్ చదివిన స్నేహితులు రూ.78వేలు నగదు ఆర్థికసాయం అందజేశారు. ఈ వితరణను జిసిడిఒ కె.రోజారమణి, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జిఒ 117ను వెంటనే రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిఒ 117 దుష్పరిణామాలు వాటి ఫలితాల్ని ఇవ్వడం ప్రారంభించాయని జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణారావు అన్నారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్ఎస్ దుర్గారావు అధ్యక్షతన గురువారం పార్వతీపురం పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా విస్తత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు-నేడు ద్వారా వేలకోట్ల ధనాన్ని వెచ్చించి పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించినా ప్రాథమిక పాఠశాలల విచ్చిన్నం కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో ఒకటి, రెండు తరగతుల్లో తమ పిల్లలను చేర్పించడం లేదని అలాగే మూడో తరగతి విద్యార్థులు సంబంధిత విలీన ఉన్నత పాఠశాలలో చేరడం లేదని ప్రధాన కార్యదర్శి అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలు బలోపేతం కావాలంటే జీవో 117 వెంటనే రద్దు చేయాలని కోరారు. జిల్లా శాఖ అధ్యక్షులు ఆర్ఎస్ దుర్గారావు, కార్యదర్శులు రావాడ అప్పలనాయుడు, ఎంవి గౌరీ శంకర్రావు, డి.వేణు, మండల శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్న ఈ సమావేశంలో మన్యం జిల్లా శాఖలో పనిచేసి ఫెడరేషన్ అభివృద్ధిలో విశేష కృషి చేసి విజయనగరం జిల్లాకు బదిలీ అయిన ఏపీటీఎఫ్ కార్యకర్తలు సింగారపు ఎల్లయ్య, డి.రామకృష్ణను ఘనంగా సత్కరించారు.

నాలుగేళ్లలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి పూర్తిగా శూన్యమైందని కురుపాం నియోజకవర్గ బిజెపి నాయకులు నిమ్మక జయరాజు విమర్శించారు. కురుపాం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను ప్రస్తావించలేదన్నారు. 16 ఏళ్లుగా అడవి ఏనుగుల సమస్య ఉన్నా ఈ ప్రభుత్వానికి కనిపించలేదన్నారు. మరోవైపు పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మాణం పనుల ప్రసక్తే లేదన్నారు. నేటికీ మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలి సాయంతో రోగులను ఆసుపత్రికి తీసుకు వస్తున్న సందర్భాలు నిత్యం కనిపిస్తూనే ఉన్నాయని అన్నారు. ఐటిడిఎ ఉన్నా ప్రయోజనం లేదన్నారు. ప్రతి సోమవారం గిరిజనుల సమస్యలను తెలుసుకోవాల్సిన పిఒ కలెక్టర్ గ్రీవెన్స్‌లో పాల్గొనడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజనుల సమస్యల పరిష్కరించాలని కోరారు.

మళ్లీ తెరపైకి జయమణి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఎన్నికలు ముంచు కొస్తున్న సమయంలో మళ్లీ తెరపైకి మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి వస్తున్నారు. పార్వతీపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం వైసిపి పార్టీ తరపున టికెట్‌కు ప్రస్తుత ఎమ్మెల్యే అలజంగిజోగారావు, గతంలో స్వల్పతేడాతో ఓడిపోయిన ఎపి టిడ్కో చైర్మన్ జమ్మానప్రసన్న కుమార్‌ల మధ్యే పోటీ ఉంటుందని వైసిపి అభిమానులు, కార్యకర్తలు భావిస్తున్న తరుణంలో ఇప్పుడు రంగంలో తానున్నానంటూ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు సవరపు జయమణి తన ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఐప్యాక్‌తో పాటు ఇతరాత్ర సర్వేల ప్రకారం, పార్వతీపురం వైసిపి అభ్యర్థిని మార్చడానికి అధిష్టానం ఆలోచనలో పడిందని, ఐతే ఈ పరిస్థితుల్లో ప్రజల్లో బలంగా పాతుకుపోయిన అలజంగి జోగారావు, టిడ్కో చైర్మన్‌గా అధికారులు దగ్గర, అధిష్టానం దగ్గర మంచిపేరు సంపాదించుకున్న జమ్మాన ప్రసన్నకు టికెట్ ఇస్తే పార్టీలో అలజడి రేగే అవకాశం ఉన్నందున, పార్వతీపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గానికి మధ్యే మార్గాన మహిళలకు టికెట్ అనే పల్లవి అధిష్టానం అందుకుందని, దీన్ని అవకాశంగా మలుచుకొనేందుకు పావులు కదుపుతున్నట్టు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసి జయమణి (ఫైల్)

తెలిసింది. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసి, నియోజకవర్గ ప్రజల వద్ద మంచి పేరు తెచ్చుకున్న సవరపు జయమణి రంగంలోకి దిగారు. అప్పుడే నియోజకవర్గంలో తనకున్న పరిచయస్తులను కలిసి, తన ఉద్దేశ్యాన్ని తెలియజేసి, వారి మద్దతును కోరుతున్నారు. ఈ క్రమంలో గత రెండురోజులగా పార్వతీపురం పట్టణంలో తన భర్తతో కలిసి పర్యటించి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వెన్నుదన్నుగా నిలిచిన వర్తక, వ్యాపార, రాజకీయ వర్గాలను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతానగరం మండలం చినభోగిలికి చెందిన తను 2009 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవర్గంలో ఎన్నలేడూ లేని అభివృద్ధిని చూపి, మంచి పేరు సంపాదించుకున్నానని చెబుతున్నారు. ఆ తరువాత మారిన రాజకీయ పరిణామాల వల్ల, ప్రజలకు దూరమైన మాట వాస్తవమేనన్నారు. అధిష్టానం ఆలోచనల మేరకు ప్రస్తుతం పార్వతీపురం నియోజకవర్గానికి నీతి, నిజాయితీ, నిబద్ధత అనుభవం కలిగి, అన్ని వర్గాలను కలుపుకుపోయే అభ్యర్థికి అవకాశం ఉన్నందున, అన్ని అర్హతలు కలిగిన తాను ఈసారి నియోజకవర్గానికి పార్టీ తరపున ప్రాతినిధ్యం వహించి, ప్రజల మన్ననలను పొందేందుకు ప్రయత్నించడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ పార్వతీపురం అభ్యర్థిని మార్చరని, ఒకవేళ మహిళలకే టికెట్ ఇవ్వడానికి అధిష్టానం నిర్ణయించుకుంటే, విద్యాధికులైన అలజంగి జోగారావు, జమ్మాన ప్రసన్నకుమార్ వారి సతీమణులను కూడా రంగంలోకి పార్టీ తరపున దించే అవకాశాలు ఉన్నాయని వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘంటాపథంగా చెపుతున్నారు. ఈ నేపథ్యంలో జయమణి ఆశలు ఏ మేరకు నెరవేరనున్నాయో వేచి చూడాల్సిందే.

నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండరూరల్

పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు న్యాయం చేయాలని ఐసిడిఎస్ పథకానికి డబ్బులు కేటాయింపులు పెంచాలని జూలై 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పాలకొండ నియోజకవర్గం కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు ఎన్ హిమాప్రభ, బి.అమరవేణి మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు డబ్బులు కేటాయింపు పెంచాలని, అంగనవాడీ విద్యను బలోపేతం చేయాలని, గర్భిణుల బాల్యం తరుపు ఇస్తున్న ఆయాలు, ఇతర సరుకుల ఛార్జీలు పెంచాలని, నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని, ప్రతి నెలా గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం సరఫరా చేయాలని, సెంటర్లో వంట చేయడానికి గ్యాస్ పొయ్యిలు, వంట పాత్రలు సరఫరా చేయాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జులై 10, 11 తేదీల్లో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు జి.జెస్సీబాయ్, ధనలక్ష్మి, ఆర్. భవాని, బి.పార్వతి, ఎ.దర్శమి, నాలుగు మండలాల అంగన్వాడీ సెక్టార్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి వనరులపై పాలకుల నిర్లక్ష్యం

వర్షాధారంపైనే ఆధారపడుతున్న గిరిజన రైతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం ప్రాంతంలో దశాబ్దాలుగా జీవ గెడ్డలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఏళ్ల తరబడి అధికారం వెలగబట్టిన పాలకులు వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా పంట పొలాలకు సాగునీరందక బీడు భూములుగా మారుతున్నాయి. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో అనేక జీవగెడ్డలు ప్రవహిస్తున్నాయి. వీటిపై చిన్న చిన్న ప్రాజెక్టులు నిర్మిస్తే వేల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందే అవకాశం ఉంది. పుష్కలంగా పునరులున్న పాలకుల నిర్లక్ష్యంతో వినియోగంలోకి తీసుకురాకపోవడంతో గిరిజన అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. గుమ్మలక్ష్మీపురం మండలం సీమలగూడ మినీ రిజర్వాయర్ అభివృద్ధికి రూ.1 కోటి నుంచి రూ.3 కోట్లు వరకు మూడుసార్లు ప్రతిపాదనలు చేసినా పనులు మాత్రం ఒక్క అడుగు కూడా పడలేదు. 15 ఏళ్ళగా జలాశయం అభివృద్ధికి నోచుకోక పూర్తిగా శిథిలమైంది. ఈ రిజర్వాయర్‌ను అభివృద్ధిలోకి తీసుకొస్తే సమీపంలోని కేదారిపురం, కేదార్పురం కాలనీ, కుంభయ్యగూడ, సీమలగూడ తదితర ప్రాంతాల్లోని 10 గ్రామాల్లో 1600 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుంది. మరోవైపు గాంద్ర సమీపంలో 20 ఏళ్ల కిందట నిర్మించిన చెక్ డ్యామ్ కూడా మరమ్మతులు గురైంది. దీన్ని అభివృద్ధి చేస్తే పరిసర ప్రాంతాల్లోని 1500 ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుంది. గుమ్మిడిగెడ్డ రిజర్వాయర్ గత 15 ఏళ్లుగా కలగానే మిగిలిపోయింది.

అలాగే పనసభద్ర సమీపంలో డేకురాయి వద్ద చెక్ డాం నిర్మిస్తే 1500 ఎకరాలకు సాగునీరందుతుంది. ఈ ప్రాంతానికి వస్తున్న ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా కనీసం స్పందించిన దాఖలాల్లేవు. పర్యటన సందర్భాల్లో హామీలే తప్ప పనులు చేపట్ట లేదు. దీంతో పంట పొలాలకు సాగునీరందక గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వర్షాధారం పైనే ఆధారపడి పంటలు పండించుకోవల్సి వస్తోంది. సకాలంలో వర్షాలు కురవకుంటే ఆ ఏడాది కరువే. ఈ ఏడాది జూన్ ముగుస్తున్నా సరైన వర్షాలు పడకపోవడంతో రైతులు పొలం పనులు ప్రారంభించలేదు. వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీటి వనరులపై దష్టి సారించి వినియోగంలోకి తీసుకురావాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని సీమలగూడ చెక్‌డాం

ప్రథమ చికిత్సపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రాణాపాయం నుంచి తప్పించేది ప్రథమ చికిత్స

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్సను వీలైనంత త్వరగా అందజేయడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి ఆ వ్యక్తిని కాపాడ వచ్చని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. జిల్లా ఆసుపత్రిలో అత్యవసర వైద్యసేవలపై సిహెచ్ఒలకు (ఎంఎల్ హెచ్‌పి) గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ మేరకు డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అత్యవసర వైద్య చికిత్సా విధానం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. పాము కాటు, కుక్క కాటు లకు ప్రథమ చికిత్స, ఐవి ఇన్ఫ్యూషన్ పద్ధతులు, ఇంజెక్షన్లు వేయడం, గాయాలకు కుట్లు, డ్రెస్సింగ్స్ వేయడం, శ్వాశకోశ సంబంధిత రోగాలకు అత్యవసర పరిస్థితుల్లో చికిత్సా విధానం, తద్వారా జీవన ప్రమాణాన్ని పెంచే నైపుణ్యం మొదలగు వైద్య సేవలు ముఖ్యంగా మారు మూల ప్రాంత వాసులకు మరింత అవసరం పడుతుందని వివరించారు. అలాగే ప్రజలకు కూడా వీటిపై అవగాహన కల్పించాలని, ఎటువంటి ప్రమాదకర పరిస్థితి తలెత్తినా కాలయాపన చేయక వీలైంత త్వరగా దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి చేర్చాలన్నారు. ఈ సందర్భంగా వారి నైపుణ్యతను డిఐఒ జగన్మోహనరావు పరీక్షించారు. వెల్నెస్ కేంద్రాల్లో ఉన్న అన్ని వైద్య పరికరాలను, మందులను ఆయా సందర్భాల్లో వినియోగించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి అత్యవసర కేసు చికిత్సా వివరాలను తేదీ, సమయంతో పాటుగా రికార్డుల్లో పక్కగా నమోదు చేయాలని సూచించారు. అలాగే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నవీన్ కుమార్ ఈ శిక్షణలో పాల్గొని పలు సూచనలు చేశారు. ట్రైనర్ సునీత తదితరులు ఉన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిఏటా గణతంత్ర దినోత్సవంసందర్భంగా ప్రకటించే పద్మ అవార్డులు (పద్మ విభూషణ్, పద్మ భూషణ్ మరియు పద్మశ్రీ) ఎంపికకు ఈ ఏడాదికి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యము-విద్యా రంగం, క్రీడలు, వైద్యం, సమాజ సేవ, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ప్రజా సంబంధాలు, పౌర సేవలు మరియు వ్యాపారం, పరిశ్రమలు తదితర రంగాల్లో విశేషప్రతిభ కనబరచిన యువత/ వ్యక్తుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు https://awards.gov.in లేదా https://padmaawards.gov.in వెబ్ సైట్‌లను సందర్శించి, ఆన్‌లైన్‌లో జులై 10లోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 9849913080 ను కార్యాలయపు పనివేళలలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

పవన్‌పై వ్యక్తిగత ఆరోపణలు తగదు

ప్రజాశక్తి - కురుపాం

వ్యక్తిగత ఆరోపణలు వేరు.. రాజకీయాలు వేరన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌పై వ్యక్తిగత ఆరోపణ చేయటం సమంజసం కాదని జనసేన కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. గురువారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద కురుపాం నియోజకవర్గ జనసేన నాయకులు నేరేడుబిల్లి వంశీ ఆధ్వర్యంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గ కేంద్రానికి అమ్మఒడి కార్యక్రమం నిధులు విడుదల చేయడానికి వచ్చిన సిఎం విద్యార్థులు ఉన్నారని కూడా చూడకుండా పవన్ కల్యాణ్ పెళ్లిళ్ల గురించి వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మన్యం జిల్లాకు మొదటిసారి వచ్చిన ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపిస్తారని ప్రజల ఆశలు ఆవిరి అయ్యావని అన్నారు. విలేకరుల సమావేశంలో పార్వతీపురం నియోజకవర్గం నాయకులు అక్కివరపు మోహన్ రావు, గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్షులు కద్రక మల్లేశ్వరరావు, గారా గౌరీశంకర్, ఉపేంద్ర, పెంట శంకర్రావు, శ్రీరామ్, క్రాంతి, బొబ్బిలి,మండల అధ్యక్షులు సంచన గంగాధర్, బంకూరు పోలినాయుడు, కొమరాడ మండల అధ్యక్షులు తెంటు శ్రీకర్, చిన్నారావు, శశి, కిరణ్, ప్రేమ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పరిధిలో శివాజీ బొమ్మ జంక్షన్ నుంచి జన్నివీధి వరకు రూ.20లక్షలతో జరుగుతున్న కాలువ పనులను డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర గురువారం పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన ఈ పనులు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. టెండర్లు వేసి పనులు వెంటనే ప్రారంభించాలని, సకాలంలో పనులు జరగాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మాజీ కౌన్సిలర్లు కొల్లి వెంకటరమణ యర్రా దాలినాయుడు వున్నారు.

కాలువ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పుస్తకాల వ్యాపార దోపిడీని నివారించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్

ప్రజాశక్తి- బొబ్బిలి, విజయనగరంటౌన్

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలో పుస్తకాల వ్యాపార దోపిడీని నివారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. సీజ్ చేసిన పుస్తకాలను సైతం దొంగచాటుగా అధికారుల అండతా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పక్కదారి పట్టించడం దుర్మార్గమని అన్నారు. సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయించి విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తున్నాయన్నారు. పుస్తకాల అమ్మకాలను అడ్డుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు యాజమాన్యాలకు సహకరిస్తున్నారని విమర్శించారు. బొబ్బిలిలో పుస్తకాలు అమ్మకాలను ఎస్ఎఫ్ఐ అడ్డుకుంటే మండల విద్యాశాఖ అధికారి పట్టించుకోకుండా యాజమాన్యాలకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న ఎంఇఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పుస్తకాల అమ్మకాలను నివారించేందుకు విజిలెన్స్ కమిటీలు వేశామని చెపుతున్న అధికారులు ఎక్కడా దాడులు చేయడం లేదన్నారు.

జూలై 4న రక్తదాన శిబిరం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జిల్లాలో జూలై 4న రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రామ్మోహన్ చెప్పారు. బొబ్బిలి, చీపురుపల్లి, రాజాం, విజయనగరం, ఎస్.కోటలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు, యువత రక్తదాన శిబిరంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్, డేవిడ్, శివ, శ్రీను, వాసు, తేజ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

వడ్డించేవాడు మనవాడు అయితే బంతిలో ఎక్కడ కూర్చొన్నా ఫర్వాలేదన్న చందంగా తయారైంది గొల్జాం ఫీల్డ్‌అసిస్టెంట్ నిర్వాకం. తమకు కావాల్సిన వారికి చెరువు పనులకు వెళ్లకుండానే మస్తర్లు వేసి ఉపాధి హామీ డబ్బులు చెల్లిస్తూ వారి నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్‌అసిస్టెంట్‌ను తొలగించాలని మిగతా కూలీలు గగ్గోలు పెడుతున్నారు.

మండలంలోని గొల్జాం పంచాయతీలో 712 జాబ్‌కార్డులుండగా 1342 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదైంది. వీరిలో చాలామంది పనులకు వెళ్లకపోయినా ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్.కోటరావు మస్తర్లు వేసేస్తున్నారు. గ్రామస్తులతోపాటు కోటరావు కుటుంబీకులు గత నెల 12న తీర్థయాత్రల పేరిట కాశీకి వెళ్లి 25న గ్రామానికి చేరుకున్నారు. తీర్థయాత్రలకు వెళ్లిన సమయంలో కూడా వారికి ఫీల్డ్‌అసిస్టెంట్లు మస్తర్లు వేయడం గమనార్హం. ఆ రెండు వారాల్లోనూ వర్క్ ఐడి నంబర్ 415723తో తమ కుటుంబీకులకు ఒక వారంలో ఐదు రోజులు, మరో వారంలో ఆరు రోజులు చొప్పున ఎర్ర చెరువులో పనులు చేసినట్లు మస్తర్లు వేయడంతో ఒక్కొక్కరికి రూ.2,847 ముట్టింది. ఇదే తరహాలో పనులకు రాకుండా మస్తర్లు వేసి ఉపాధి నిధులు కాజేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కల్పించాల్సిన వంద రోజుల పనిని తనకు గిట్టని వారికి ఫీల్డ్‌అసిస్టెంట్ కల్పించడం లేదని పలువురు కూలీలు వాపోతున్నారు. మస్తర్లలో అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ కోటరావును తక్షణమే విధుల నుండి తొలగించాలని కూలీలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎపిడి ఎస్.శారదాదేవి వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

రెండు వాహనాలు ఢీ కొని ఒకరు మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సంజీవమెట్ట రోడ్డు వద్ద గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీ కొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన రావాడ లక్ష్మణరావు(20) మృతి చెందారు. సంజీవి మెట్ట నుంచి వావిలపాడు వైపు వెళుతున్న అతన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రాజేష్ మృతదేహాన్ని ఎస్.కోట ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోటదుర్గమ్మతల్లి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ఐటిఐ కాలనీ సమీపంలో ఉన్న కోటదుర్గమ్మతల్లి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి హుండీ పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి మెడలో ఉన్న మంగళ సూత్రం ఎత్తుకుపోయినట్లు ఆలయ నిర్వాహకులు గౌరి చెప్పారు. గతంలో కూడా ఈ ఆలయంలో చోరీ జరిగింది. చోరిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని గౌరి చెప్పారు